క్లుప్తంగా

గుండెపోటుతో మహిళ మృతి


రాజమ్మ(ఫైల్)

నడికూడ : సంక్రాంతి పర్వ దినాన్ని సంతోషంగా నిర్వహించునే ఆ కుటుంబానికి కన్నీళ్లు మిగిలాయి. వేకువ జామున వాకిలి ఊడ్చి ముగ్గు చేస్తున్న మహిళకు గుండెపోటు రావడంతో అక్కడే కుప్పకూలింది. ఈ సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన గొల్లపల్లి రాజమ్మ(58) సోమవారం ఉదయం సంక్రాంతి పండగా సందర్భంగా ఇంటి వాకిలిలో ముగ్గు వేస్తుంది. ఈ క్రమంలో గుండెపోటు వచ్చింది. దీంతో రాజమ్మ అక్కడే తుదిశ్వాస విడిచింది. దీంతో రాజమ్మ కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

గీత కార్మికుడికి గాయాలు



కమలాపూర్ : వృత్తిలో భాగంగా కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కుతున్న గీతకార్మికుడు ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అంబాలకు చెందిన పోడేటి శంకర్ వృత్తిలో భాగంగా కల్లు తీసేందుకు మంగళవారం తాటి వనానికి వెళ్లాడు. తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో శంకర్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



శాయంపేట : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్ 14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో మండలంలోని నేరేడుపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని సయ్యద్ రేష్మ, 7వ తరగతి విద్యార్థి సయ్యద్ అమీర్ ప్రతిభ కనబర్చారు. ఈనెల 16 నుంచి 18వ రకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు పీఈటీ జట్టి రాజేశ్వర్ తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అల్లం మాధవి, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ రాజేందర్, ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

మంత్రికి ఆహ్వానం



నడికూడ : మండలంలోని ముస్త్యాలపల్లి నల్లమాటువాగు ఒడ్డున ఉన్న హజ్రత్ సయ్యద్ మదార్‌షావలి దర్గా ఉత్సవాలకు హాజరు కావాలని దర్గా ముతవల్లి మహ్మద్ ఖాజఖాద్రి, ముస్లిం మత పెద్దలు మంత్రి కొండ సురేఖకు ఆహ్వానపత్రిక అందించారు. ఈనెల 19 నుంచి ఉర్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హమ్మద్ ముస్తాఫ, అప్సర్, నసిరుద్దీన్, ఖాజ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల గడువు పెంపు

మడికొండ : తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల గడువు తేదీని ఈ నెల 20 వరకు పొడిగించినట్లు (వర్ధన్నపేట) మడికొండ బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ ఎండీ.ఖుర్షీద్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-2025 సంవత్సరంకు గాను 5వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 4వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు అర్హులని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెస్ క్రీడాకారిణికి సత్కారం



న్యూశాయంపేట : వరంగల్ నగరంలోని 43వ డివిజన్ రహమత్‌నగర్‌లోని ఏఆర్‌కే అంజుమన్ ఆధ్వర్యంలో సోమవారం కాకతీయ యూనివర్సిటీ చెస్ మహిళా జట్టు తరపున ఇటీవల తమిళనాడులో జరిగిన సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొన్న బోగోజు దేవికను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంస్థ తరపున రూ. 10,116 నగదు పురస్కారాన్ని అందజేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్ యాకూబ్‌ఖాన్, సెక్రటరీ అక్రమ్ రహమాన్‌ఖాన్, సాధిక్ అలీ సాబెర్, రహమత్‌నగర్, జయశంకర్ కాలనీల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన 'సంక్రాంతి' సంబురాలు

- వాకిళ్లలో ముగ్గులు వేసిన మహిళలు
- పతంగులతో పిల్లల కేరింతలు
- ప్రశాంతంగా ముగిసిన పండుగ


పరకాల : సంక్రాంతి పండగ సందర్భంగా వేసిన ముగ్గు

ఎల్కతుర్తి : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటాయి. సోమవారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పిల్లలు, పెద్దలు వేకుజామున తలంటు స్నానాలు ఆచరించి స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఇంటి ఎదుట ముగ్గులు వేసి వాటికి కలర్‌ఫుల్ రంగులు అద్దారు. ముగ్గులపై ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలు, రేగు పండ్లు, నవధాన్యాలు పోశారు. మూడు రోజుల పాటు చేసిన నోరూరించే పిండి వంటకాలను కుటుంబ సమేతంగా ఆరగించారు. పిల్లలు పతంగులు ఎగరవేస్తూ ఉత్సాహంగా గడిపారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సోమవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు, యువతులు, చిన్నారులు తమ తమ ఇళ్ల ముందు అందమైన రంగవల్లులు అలంకరించి ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలు పెట్టి రేగు పండ్లు, నవధాన్యాలు పోశారు. పలువురు భక్తులు బోనాలు సమర్పించి ఇళ్లల్లో సంక్రాంతి నోములు నోముకున్నారు. మండలం నుంచి పెద్ద ఎత్తున భక్తులు ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో కొత్తకొండకు తరలివెళ్లి కోరమీసాల వీరభద్రస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, మహిళలు, యువతులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండలంల వ్యాప్తంగా సోమవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు తమ ఇళ్ల ఎదుట రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలను ఉంచారు. పిండి వంటలను ఆరగించారు. ఆలయాలల్లో ప్రత్యేక పూజలు చేశారు. పిల్లలు యువకులు పతంగులు ఎగురవేసి సంబురాలు జరిపారు. యువకులకు వాలీబాల్, క్రికెట్ క్రీడా పోటీలను నిర్వహించారు.

నడికూడలో..


నడికూడ : ముగ్గులు వేస్తున్న యువతులు


కమలాపూర్ : ముగ్గులు వేస్తున్న మహిళలు


ఎల్కతుర్తిలో..

నడికూడ : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా సోమవారం వేడుకలు ఘనంగా జరిగాయి. వేకువజామున నిద్రలేచిన మహిళలు, యువతులు ఇంటి వాకిళ్లలో రంగురంగుల ముగ్గులు వేశారు. ఆవుపేడతో గొబ్బెమ్మలు ఉంచి పువ్వులు, రేగి పండ్లు, నవధాన్యాలు పోసి నూతన వస్త్రాలు ధరించి సంబురాలు జరిపారు. పిల్లలు గాలిపటాలు ఆకాశంలోకి ఎగరవేస్తూ కేరింతలు కొట్టారు. అలాగే నర్సక్కపల్లి ఎంపీటీసీ బుర్ర దీప దేవేందర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.


శాయంపేటలో..

పరకాలలో..

పరకాల : పట్టణ ప్రజలు సంక్రాంతి వేడుకలను సంబురంగా నిర్వహించారు. మహిళలు ఇంటింటా పిండి వంటలతో పాటు ఇంటి ఎదుట రంగురంగుల ముగ్గులు వేశారు. చాలా రోజుల తర్వాత కుటుంబ సభ్యులు, బంధువులంతా ఒక్క చోటుకు చేరుకొని సరదా ముచ్చట్లతో సంతోషంగా గడిపారు.

బీఆర్‌ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే


మాట్లాడుతున్న సింగపురం ఇందిర

ధర్మసాగర్ : తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీజేపీ రెండూ ఒక్కటేనని కాంగ్రెస్ పార్టీ స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర అన్నారు. మండలంలోని బంజర్‌పల్లి గ్రామంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని తన అక్కసును వెళ్లగక్కారని విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలిపోతుందనడం హేయమైన చర్య అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చుతుంటే బీఆర్‌ఎస్ నాయకుల కడుపు మండుతుందని అన్నారు. బీజేపీ నాయకుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను కూడా తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఏపార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి మారే కడియం శ్రీహరికి బీఆర్‌ఎస్ పార్టీ అధికారం కోల్పోయి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. గతంలో కడియం శ్రీహరిని ఎన్‌టీఆర్ పిలిచి టికెట్ ఇచ్చి మంత్రిని చేస్తే చంద్రబాబు నాయుడితో కలిసి ఆనాడు వెన్నుపోటు పొడిచి ఎన్‌టీఆర్ ప్రభుత్వాన్నే కూల్చిన ఘనత కడియం శ్రీహరికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ప్రజాపాలన దరకాస్తులు స్వీకరిస్తుంటే మోసపూరిత మాటలు మాట్లాడుతున్నారని, పద్ధతి మార్చుకోవాలని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న 10 సంవత్సరాలు నియంత పాలన కొనసాగించి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. ఈ సమావేశంలో మండల ఇన్‌చార్జ్ ముత్తిరెడ్డి అమరేందర్‌రెడ్డి, నాయకులు లింగాల జగదీశ్‌రెడ్డి, గుర్రపు ప్రసాద్, మహేందర్‌రెడ్డి, శ్రీను, ఆరోగ్యం, రవీందర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే ఆలయాల అభివృద్ధి

ఎల్కతుర్తి : రాష్ట్రంలోని వివిధ ఆలయాలు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామిని మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్, జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్‌తో కలిసి ఆయన స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలంతా సుఖ, సంతోషాలతో జీవించడంతోపాటు పంటలు సంమృద్ధిగా పండాలని వీరభద్రస్వామి వారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలోనే అన్ని ఆలయాలను అభివృద్ధి చేశామని అన్నారు. భక్తుల సౌకర్యార్థం మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. దీంతో ఆలయాలకు భక్తుల తాకిడి విపరీతంగా పెరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేసి మరింత అభివృద్ధి చేయాలని కోరారు.

ఈటల పూజలు

కొత్తకొండ వీరభద్రస్వామిని బీజేపీ నేత, మాజీ మంత్రి ఈటల రాజేందర్ దర్శించుకున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం పూర్తిగా మెట్టప్రాంతమని, వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు పండాలని, ప్రజలు సుఖ, సంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వలన ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయే పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం స్పందించి వారికి ప్రత్యామ్నాయం చూపడంతో పాటు ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఐనవోలు జాతరలో భక్తుల ఇబ్బందులు


దర్శనానికి అనుమతించాలని కానిస్టేబుల్‌ను ప్రాథేయపడుతున్న ప్రజల బండి నిర్వాహకులు



జాతరలో పడేసిన ప్లాస్టిక్ బాటిళ్లు

ఐనవోలు : ప్రఖ్యాత ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో సంక్రాంతి నుంచి ఉగాది వరకు జరిగే బ్రహ్మోత్సవ జాతరలో భక్తులకు తీవ్ర అవస్థలు, ఇబ్బందులు తప్పడం లేదు. సంకాంత్రి మూడు రోజులు లక్షలాది మంది భక్తులు ఆలయానికి వస్తుంటారు. కాగా సామాన్య భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉండాలనే ఉద్దేశంతో గతంలో ఉన్న వీఐపీ పాసులను రద్దు చేసి వీవీఐపీ టికెట్ ధర రూ.500గా నిర్ణయించి టికెట్ కౌంటర్ ఏర్పాటు చేశారు. అయితే ఈ నిర్ణయంపై మల్లన్న భక్తులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చిన వీవీఐపీ టికెట్ గురించి స్థానికుల అభ్యంతరాలు, సమస్యలు, అభిప్రాయాలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. ఇష్టారీతిన ఎండోమెంట్ నిబంధనలకు విరుద్ధంగా నూతన టికెట్‌ను ఎలా ప్రవేశపెడుతారని ఐనవోలు, ఒంటిమామిడిపల్లి గ్రామస్తులు ఎండోమెంట్ ఉన్నతాధికారులను ప్రశ్నిస్తున్నారు. అడిషనల్ కలెక్టర్ రాధికగుప్తా సోమవారం దేవాలయాన్ని పర్యవేక్షించి తాగునీటి సమస్య, పారిశుద్ధ్యంపై అధికారులను మందలించడంతో పాటు జాతర ఏర్పాట్లపై అలసత్వం వహించకూడదని అధికారులను ఆదేశించారు.

భక్తులకు నిరాశ

భోగి, సంక్రాంతి పర్వదినాల్లో భక్తుల సౌకర్యార్థం 24 గంటలు ఆలయం తెరిచి ఉంచి స్వామి వారి దర్శనం కల్పించే ఆనవాయితీ చాల ఏళ్లుగా కొనసాగుతోంది. అయితే సంక్రాంతి రోజు ఒంటి మామిడిపల్లి, ఐనవోలు లక్ష్మీపురం గ్రామాలకు చెందిన పలువురు బండ్లు కట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి తెల్లవారు జామున ఆలయంలోకి ప్రవేశించి ఒడిబియ్యం సమర్పణతో పాటు దర్శనానికి రాగా ఆలయ తలుపులు మూసివేశారు. దీంతో పూర్వం నుంచి ఎన్నడూ మల్లన్న దర్శనం కాకుండా తిరిగి వెళ్లలేదని వారు వాపోయారు. ఆలయ అధికారులు, అర్చకులను వివరణ కోరగా ప్రాతకాల పూజ కోసం మూసి వేసినట్లు చెప్పారు. ఆలయంలో అధికార పార్టీ నేతల వ్యవహారతీరు ఐనవోలు, వర్ధన్నపేట మండలాలతో పాటు చుట్టు ప్రక్కల మండలాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎండోమెంట్ శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టి సారించాలని మల్లన్న భక్తులు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై ఆలయ ఈఓను వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.


తెల్లవారు జామున మూసిఉన్న ఆలయం

రామా శ్రీనివాస్ సేవలు చిరస్మరణీయం



కాజీపేట అర్బన్ : మోక్షారామం ఫౌండేషన్, అమ్మ ఒడి సృష్టికర్త, వరల్డ్ పద్మశాలి క్లబ్ అండ్ రాష్ట్ర పద్మశాలి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రామా శ్రీనివాస్ సేవలు చిరస్మరణీయమని సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చందా మల్లయ్య తెలిపారు. 31వ డివిజన్ పరిధిలోని హంటర్‌రోడ్డులోని బీసీ నేత హాస్టల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన శ్రీనివాస్ సంస్మరణ సభలో సంఘం నాయకులు పాల్గొని శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దుస్సా జనార్ధన్, కృష్ణారావు, సుధీర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మడికొండ: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మడికొండలో జరిగింది. పోలీసులు కథనం ప్రకారం మడికొండకు చెందిన అరూరి హన్మంతరావు (45)అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది జనవరి 2న గుర్తుతెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దివ్య తెలిపారు.

'లక్ష్మీనర్సింహస్వామికి' పోటెత్తిన భక్తులు

- మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే రేవూరి


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రేవూరి

దామెర : మండలంలోని ఊరుగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి జాతరకు భక్తులు పోటెత్తారు. మండల కేంద్రంతో పాటు ఉమ్మడి జిల్లా నుంచి భక్తులు తరలిరావడంతో జాతర ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆలయ ప్రధాన అర్చకుడు తూపురాణి శ్రీనివాసాచార్యులు పంచామృతాలతో అర్చన, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు, టెంకాయను శ్రీలక్ష్మీనర్సింహస్వామికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో వెలిసిన దుకాణాల వద్ద పిండి పదార్థాలు, ఆట వస్తువులు కొనుగోలు చేస్తూ చిన్నారులు ఉల్లాసంగా గడిపారు. కాగా సోమవారం సాయంత్రం గ్రామం నుంచి శోభాయాత్ర నిర్వహించి స్వామివారి ఉత్సవ విగ్రహాలను గుట్టపైకి తీసుకువచ్చే కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళల కోలాటాలు, నృత్యాలు, డప్పు చప్పుళ్లు, నర్సింహస్వామి భక్త మండలి భక్తి పాటలు అలరించాయి. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై కొంక అశోక్ తమ సిబ్బందితో బందోబస్తు న్విహించారు.

ఆలయ అభివృద్ధికి కృషాచేస్తా

ఊరుగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఆలయంలో మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం జాతరలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గ్రామంలోని ఆలయంతో పాటు గుట్టపై ఉన్న స్వామివారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండల అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, నాయకులు సుధాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పోచయ్య, శంకర్ ఉన్నారు. అదే విధంగా సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, ప్యాక్స్ చైర్మన్ రాజు, ఉపసర్పంచ్ సాగర్ మొక్కులు చెల్లించుకోగా ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులతో పాటు అర్చకులు వినయకుమారచార్యులు, అఖికుమారచార్యులు, జయకృష్ణాచార్యులు, బాలక్రిష్ణాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీషిర్డి సాయి మందిర్ వార్షికోత్సవం

పరకాల : పట్టణంలోని శ్రీషిర్డి సాయిసత్సంగ్ మందిర్ వార్షికోత్సవాలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హాజరుకాగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రోచ్ఛరణల నడమ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం


దామెర : మాట్లాడుతున్న ఎస్సై అశోక్

దామెర : క్రీడలతో శారీరక ధృడత్వంతో పాటు మానసికోల్లాసం లభిస్తుందని ఎస్సై కొంక అశోక్ అన్నారు. మండలంలోని ల్యాదెళ్లలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని క్రికెట్ పోటీలు నిర్వహించగా ఆయన హాజరై ప్రారంభించారు. మొదట క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని గెలిచినా.. ఓడినా సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని పాటించాలని అన్నారు. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పాలెపాక శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు కుమార్, నాయకులు రాజు, రాసమల్ల కిరణ్, సుధాకర్ పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని బీఆర్‌ఎస్ నాయకుడు దాసి శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గోవిందాపూర్‌లో సంక్రాంతి పండగను పురస్కరించుకొని సోమవారం యూత్ సభ్యులకు వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి పొందిన మహేష్ టీంకు రూ. 3000 నగదు బహుమతి, ద్వితీయ స్థానం సాధించిన బైరి ప్రవీణ్ టీంకు రూ. 2000, తృతీయ స్థానంలో నిలిచిన కలవాల శ్యామాజీ టీంకు రూ.1000 నగదును అందించారు.

వేలేరులో..

వేలేరు : క్రీడల్లో గెలుపోటములు సహజమని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎర్రబెల్లిలో భూక్య అంజమ్మ స్మారకార్థం ఆమె కుమారుడు భూక్య సమ్మయ్య (కస్టమ్స్ అండ్ సెంట్రల్ ట్యాక్స్ సూపరిండెంట్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గూడ కవిత రాజ్‌కుమార్, ఉపసర్పంచ్ అల్లం సతీష్, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ వీరస్వామి, మాజీ సర్పంచ్ చిన్నబాబు, శ్రావణ్‌తో పాటు క్రీడాకారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

మినీ జాతర ఉత్సవ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక


ఎన్నికైన మినీ జాతర నూతన కమిటీ సభ్యులు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామ సర్పంచ్ అబ్బు ప్రకాశ్ రెడ్డి జోగంపల్లి సమ్మక్క-సారలమ్మ మినీ జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం పెద్ద కోడెపాక, జోగంపల్లి, మైలారం గ్రామ పెద్దలు జాతర ఉత్సవ నిర్వాహణ కమిటీని ఎన్నికుకున్నారు. ఉపాధ్యక్షుడిగా దూదిపాల చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా చల్లా నరసింహరెడ్డి, చెక్క రామ్మూర్తి, సహాయ కార్యదర్శిగా ముల్కనూరు నర్సయ్య, కోశాధికారిగా అమ్మ అశోక్, సహాయ కోశాధికారిగా మంద సదానందం, ముఖ్య సలహాదారుడిగా తడుక రవి, కార్యవర్గ సభ్యులుగా బజ్జూరి రాజేందర్, బుస్స కొమురయ్య, రాజోజు నరహరి, కోగిల ఆనందం, నూనె కిరణ్, జక్కుల పాణి, బొద్దుల మొగిలి, మామిడిపల్లి సాంబయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తమను ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

హసన్‌పర్తి: అనారోగ్యంతో మరణించిన వంగపహాడ్ మాజీ సర్పంచ్ పిన్నింటి కొండల్‌రెడ్డి మృతదేహాన్ని మంగళవారం మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ సందర్శించారు. ఈ సందర్భంగా మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుమారుడు రఘుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలను ఓదార్చారు.ఆయన వెంట మాజీ సర్పంచ్ రాజేందర్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ రాజేష్, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి


అరుణ్ (ఫైల్)

కమలాపూర్ : మండల కేంద్రంలోని పెట్రోల్‌బంక్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ బొలుమల్ల సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. వంగపల్లికి చెందిన నకీర్త శివకుమార్ ఈనెల 14వ తేదీన సాయంత్రం కమలాపూర్‌కు వెళ్లొస్తానని ఇంట్లో చెప్పి బయటికెళ్లాడు. రాత్రి సమయంలో కమలాపూర్‌కు చెందిన నాగిశెట్టి అరుణ్(19)తో కలిసి టీఎస్ 03 ఎఫ్‌ఈ 7526 నంబరు గల పల్సర్ బైక్‌ను అరుణ్ నడుపుతుండగా శివకుమార్ వెనుక కూర్చుని వంగపల్లి వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్‌బంక్‌లో టీఎస్ 24 ఈ 1963 నంబరు గల ట్రాక్టర్‌లో డీజిల్ పోయించుకుని యూటర్న్ తీసుకుంటున్న నడికూడకు చెందిన ఎండిగ రాజేశ్వర్‌రావు బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శివకుమార్, అరుణ్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 ద్వారా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శివకుమార్ మృతి చెందగా అరుణ్ చికిత్స పొందుతున్నాడు. అర్ధరాత్రి సమయంలో పరిస్థితి విషమించి అరుణ్ మృతి చెందినట్లు తెలిపారు. శివకుమార్ తండ్రి నకీర్త ఐలయ్య ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ రాజేశ్వర్‌రావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ప్రత్యేక ఆకర్షణగా మేకల బండ్లు



వేలేరు : వివిధ జాతరాల్లో సాధారణంగా ఎడ్లబండ్లు కనిపిస్తుంటాయి. కానీ కొత్తకొండ జాతరలో మేకల బండ్లు కనపించడంతో భక్తులు ప్రత్యేకంగా తిలకించారు. సోమవారం రాత్రి మండల కేంద్రానికి చెందిన యాదవులు ప్రతీ సంవత్సరం మేకపోతులతో తయారు చేసిన బండ్లతో జాతరకు వస్తుంటారు. ఈ ఏడాది కూడా జాతరలో మేకల బండ్లతో రావడంతో ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేశారు.